

అదరగొట్టిన కడప బాలికలు

మైదుకూరులో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–17 బాలుర, బాలికల వాలీబాల్ పోటీల్లో కడప, విజయనగరం జట్లు అదరగొట్టాయి. -8లో



ఇస్రో శిక్షణతో ఉపయోగం

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అందించే శిక్షణ పీజీ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని వైవీయూ వైస్ చాన్సలర్ చింతా సుధాకర్ పేర్కొన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.98	రూ.120
రెండోరకం	రూ.56	రూ.94



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 372 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	456	520
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 499.49 కిలోలు

న్యూస్‌రీల్

వైభవం..పల్లకీ ఉత్సవం



పల్లకీలో ఊరేగుతున్న వీరభద్రస్వామి

రాయచోటిటౌన్: రాయచోటి శ్రీభద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామికి పల్లకీ ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపారు. ఉత్సవ మూర్తులను పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించారు.పల్లకిలో కొలువు దీర్చారు ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఈవో డీవీ రమణారెడ్డి, స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు పాల్గొన్నారు. అర్చకులు వీరికి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

బాధితులకు న్యాయం చేయాలి



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

రాయచోటి: స్పందన ఫిర్యాదులకు సత్వరం పరిష్కారం చూపాలని, బాధితులకు న్యాయం చేయాలని జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని ఎస్పీ కృష్ణారావు ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి ఎస్పీ నేరుగా వినతులను స్వీకరించారు. 90 మంది ఎస్పీని కలిసి తమ సమస్యలకు పరిష్కారం చూపాలని విన్నవించుకున్నారు. స్పందనకు వచ్చే ఫిర్యాదులపై సకాలంలో స్పందించి చట్ట ప్రకారం పరిష్కారం చూపాలన్నారు. అర్జీలకు ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత సమయంలోగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని జిల్లా పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు.

ఇంటర్వ్యూలు ప్రశాంతం



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

రాయచోటి: అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సాధికారత ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్వ్యూలు ప్రశాంతంగా ముగిశాయి. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పరిధిలో ఖాళీగా ఉన్న జిల్లా కోఆర్డినేటర్, ప్రాజెక్టు సహాయకుల ఎంపిక ఇంటర్వ్యూలను కమిటీ సభ్యులు నిర్వహించారు. రాయచోటి, చిట్వేల్, కోడూరు, టి.సుండుపల్లె, పీలేరు, వాల్మీకిపురం, తంబళ్లపల్లి, బి.కొత్తకోటలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న బ్లాక్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నియామకాల భర్తీ కోసం దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఇంటర్వ్యూలు పూర్తి చేసినట్లు జిల్లా స్త్రీ ,శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారిణి ధనలక్ష్మి తెలిపారు. సెలక్షన్ కమిటీ మెంబర్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారిణి ఎం.ధనలక్ష్మి, జిల్లా న్యూక్లెస్ మెడికల్ అధికారి డాక్టర్ జి.విష్ణువర్ధన్, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రార్థనకు వెళుతూ.. పైలోకాలకు..

- రోడ్డుప్రమాదంలో నలుగురు దుర్మరణం
- 10 మందికి తీవ్రగాయాలు
- మృతులు కడప, ప్రొద్దుటూరు చెందిన వారు



ప్రొద్దుటూరు ఆసుపత్రిలో మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు



షాకీర్ మృతదేహం ఇన్‌సెట్ ఫైల్‌ఫొటో



మృతి చెందిన హసీనా ఇన్‌సెట్ ఫైల్ ఫొటో



అమీనా మృతదేహం ఇన్‌సెట్ ఫైల్‌ఫొటో



మహబూబ్‌బాషా మృతదేహం ఇన్‌సెట్ ఫైల్ ఫొటో

ఎర్రగుంట్ల/ప్రొద్దుటూరు: మదినిండా భక్తితో..తాము నమ్ముకున్న దైవానికి కోరికలు విన్నవించి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని కోరుతూ ప్రార్థనకు బయలుదేరిన వారిని రోడ్డుప్రమాద రూపంలో మృత్యువు వెంటాడంతో మరలిరాని లోకాలకు వెళ్లారు. దయనీయమైన ఈ సంఘటన సోమవారం ఎర్రగుంట్ల మండలంలో జరిగింది. ఆటోను బస్సు ఢీకొనండంతో నలుగురు దుర్మరణం చెందగా..10 మంది తీవ్రంగా గాయపడ్డారు.

పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలోని ఆజాద్‌నగర్ కాలనీకి చెందిన మైనార్టీలు పూల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కడపలో నివాసం ఉండే మహచాన్, మాహబూబ్‌బాషా, హసీన, నఫీసా, బీబీజాన్‌లు కుటుంబీలకుతో కలసి తొండూరు మండలంలోని మల్లేల గ్రామంలో ఉన్న మసీద్‌కు వెళ్లడానికి ఆటోలో కడప నుంచి బయలు దేరారు. వీరు ప్రొద్దుటూరులోని పెన్నానగర్, సుబ్బిరెడ్డినగర్‌కాలనీలలో ఉన్న వారి బంధువులను కూడా పిలుచుకెళ్లడానికి మైదుకూరు మీదుగా ప్రొద్దుటూరుకు వచ్చారు. ప్రొద్దుటూరులోని ఎస్ కమాల్‌బాషా, జాఖీర్, అమీనా, షేఫ్విన్‌లను ఎక్కించుకున్నారు.మల్లేల మసీద్ వద్ద ప్రార్థనలు చేసుకోవడానికి ఆటోలనే అన్నం, కూరలు, తినుబండరాలను తీసుకుని బయలు దేరారు. వీరిని మృత్యువు వెంటాడింది. ఎర్రగుంట్ల పట్టణంలోని ప్రొద్దుటూరు మార్గంలో ఉన్న ఎస్వీ కల్యాణ మండపం వద్దకు రాగానే ముందు వెళతున్న లారీనీ క్రాస్ చేస్తుండగా పులివెందుల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో సయ్యద్ మహబూబ్ బాషా (30), సయ్యద్ హసీనా (26), అమీనా (28), షేక్ షాకీర్‌బాషా (13)లు అక్కడిక్కడే మృతి చెందారు. మిగిలిన వారిలో ఎస్ అయిషా(4), ఎస్ అసిఫా (6), షేక్ కమాల్‌బాషా (15), షేక్ జాబీస్(15), షేక్ నఫీసా(38), షేక్ నస్రీన్ (13), షేక్ మహచాన్ (50), షేక్ జాకీర్ (12), సయ్యద్ బీబీజాన్ (67), షేక్ షేఫ్విన్ (35)లు తీవ్రంగా గాయపడ్డారు.. ఈ దుర్ఘటనతో రహదారి అంతా రక్తసిక్తమైంది. ఆటో నుజ్జునుజ్జు అయింది. ప్రమాదం జరిగిన వెంటనే ఆ మార్గంలో వెళుతున్న స్థానికులు గాయపడిన వారిని ప్రత్యేక ప్రైవేట్ వాహనాల్లో చికిత్స కోసం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. ఎర్రగుంట్ల పట్టణ సీఐ ఈశ్వరయ్య , ఎస్‌ఐ ప్రవీణకుమార్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎర్రగుంట్ల తహసీల్దార్ నాగేశ్వరరావు విషయాన్ని జిల్లా కలెక్టర్ విజయరామ రాజుకు తెలియజేశారు.

దర్గాకు వెళ్లాలని అక్క ఇంటికి వచ్చారు..

ప్రొద్దుటూరులోని పెన్నానగర్‌కు చెందిన షేక్ మహబూబ్‌బాషా కూరగాయాల మార్కెట్‌లో గుమాస్తాగా పని చేస్తున్నాడు. అతనికి భార్య షఫివున్,షాకీర్, జాకీర్, కమాల్‌బాషా అనే ముగ్గురు కుమారులు న్నారు. అతని బావమరిది సయ్యద్ మహబూబ్‌బాషా కడపలోని ఆజాద్‌నగర్‌లో ఉంటున్నాడు, అతను కుటుంబ సభ్యులతో కలిసి మల్లేల ఇమాంబి దర్గాకు వెళ్లేందుకు ఆదివారం ప్రొద్దుటూరుకు వచ్చాడు. అందరూ కలసి అక్క ఇంట్లో సరదాగా గడిపారు. సోమవారం ఉదయం మల్లేల ఇమాంబి దర్గాకు వెళ్లాలని చర్చించుకున్నారు. ఈ మేరకు రాత్రి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రొద్దుటూరులోనే ఒక ఆటోను బాడుగకు మాట్లాడుకొని అందులో వెళ్తుండగా ఎర్రగుంట్ల సమీపంలోకి వెళ్లగానే ఆటో ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో కడపకు చెందిన సయ్యద్ మహబూబ్‌బాషా, అతని భార్య హసీనా, ప్రొద్దుటూరులోని షేక్ మహబూబ్‌బాషా కుమారుడు షాకీర్‌బాషా, ఈశ్వరరెడ్డినగర్‌కు చెందిన అమీనా మృతి చెందారు. అమీనా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు రోదించసాగారు.

- రోడ్డు ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకున్న ప్రొద్దుటూరు మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి సోమవారం జిల్లా ఆస్పత్రికి వచ్చి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. విజయవాడలో ఉన్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.

ఆర్టీసీ, టిప్పర్ డ్రైవర్లపై కేసు నమోదు

రోడ్డు ప్రమాద ఘటనపై విచారణ జరిపి ఆర్టీసీ డ్రైవర్, టిప్పర్ డ్రైవర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎర్రగుంట్ల సీఐ ఈశ్వరయ్య సోమవారం తెలిపారు.

కుమారుడు మృతి..భార్య, మరో ఇద్దరు కొడుకులకు గాయాలు



విలపిస్తున్న షాకీర్ తండ్రి మహబూబ్‌బాషా

మహబూబ్‌బాషా కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. రోడ్డు ప్రమాదంలో కుమారుడు షాకీర్‌బాషా మృతి చెందగా భార్య షఫివున్, మరో ఇద్దరు కుమారులు జాకీర్, కమాల్‌బాషాలకు గాయాలయ్యాయి. వీరిలో షఫివున్ తీవ్రంగా గాయపడ్డారు. షాకీర్‌బాషా మరణంతో పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులు.. గాయపడిన షఫీవున్, ఇద్దరు పిల్లలను తలుచుకుంటూ వారికి ఏమౌతుందోనని రోదించసాగారు.

అజాద్‌నగర్‌లో విషాదం

కడప అర్బన్/చింతకొమ్మదిన్నె: కడపలోని ఆజాద్‌నగర్‌కు చెందిన మహబూబ్‌బాషా ఐటీఐ సర్కిల్ సమీపంలో కార్పెంటర్‌గా విధులు నిర్వహించేవాడు. అతనితో పాటు భార్య హసీనా రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.ప్రమాదంలో మరణించి శవాలుగా మారి ఇంటికి రావడాన్ని ఆ ప్రాంతంలోని వారు జీర్ణించుకోలేక పోతున్నారు. ఒకే కుటుంబంలోని భార్యాభర్తలు ఇద్దరు మృత్యువాత పడటం, వారి బంధువులు క్షతగాత్రులుగా మారి ఆసుపత్రుల్లో చికిత్స పొందటంతో ఆజాద్‌నగర్‌లో విషాదం నెలకొంది. భార్యాభర్తల మృతదేహాలకు మంగళవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కడపలోని ఇందిరానగర్‌కు చెందిన హసీనాను రెండేళ్ల క్రితమే మహబూబ్‌బాషాకు ఇచ్చి వివాహం చేశారు. వారు చాలా అన్యోన్యంగా ఉండేవారనీ, ఇలా మృత్యువాత పడటంతో ప్రతిఒక్కరూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్


రాయచోటి: 'జగనన్నకు చెబుదాం స్పందన' కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలపై శ్రద్ధపెట్టి సత్వరమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో 'జగనన్నకు చెబుదాం స్పందన' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణలు ప్రజలు నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు

ప్రతినిధుల సభలో జిల్లా నేతలు



విజయవాడలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా, ఎమ్మెల్యేలు కొరముట్ల శ్రీనివాసులు, చింతల రామచంద్రారెడ్డి, శెట్టిపల్లె రఘురామిరెడ్డి, పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం తదితరులు పాల్గొన్నారు.

బిర బిరా కృష్ణమ్మ..



చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి పుంగనూరు ఉపకాలువకు విడుదలైన కృష్ణా జలాలు

- హంద్రీనీవా ప్రాజెక్టు అధికారుల చేతులమీదుగా నీటి విడుదల
- అర్భాటానికి, ప్రచారానికి దూరంగా కార్యక్రమం
- బుధవారం రాత్రికి సరిహద్దులోకి కృష్ణమ్మ

బి.కొత్తకోట: అన్నమయ్య జిల్లాకు కృష్ణా జలాల విడుదల కార్యక్రమం సోమవారం అత్యంత నిరాడంబరంగా జరిగింది. గత పాలకులకు భిన్నంగా ప్రచారానికి, అర్భాటానికి వెళ్లకుండా నిధుల వృథాను అరికట్టేలా కార్యక్రమం నిర్వహించారు. ఏపీ ఆర్ హంద్రీనీవా ప్రాజెక్టు రెండోదశకు సంబంధించి సత్యసాయిజిల్లా కదిరి సమీపంలోని చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి జిల్లాలోకి ప్రవేశించే పుంగనూరు ఉపకాలువ ద్వారా కృష్ణా జలాలను తరలిస్తారు. చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి నీటిని జిల్లాకు విడుదల చేసే కార్యక్రమం సోమవారం నిరాడంబరంగా జరిగింది. మదనపల్లె ఎస్ఈ సీఆర్ రాజగోపాల్, డీఈలు వెంకటేశ్వర్లు, త్రివేణి, సురేంద్రనాథ్‌రెడ్డి, జేఈలు శ్రీదేవి, ప్రతాప్, వనిత, శ్యాంప్రసాద్, సుస్మిత, కృష్ణకిశోర్‌లు పాల్గొని కృష్ణమ్మకు పూజలు నిర్వహించారు. గేటును ఎత్తి నీటిని కాలువలోకి విడుదల చేశారు. కాగా 2019 జనవరిలో ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని టీడీపీ ప్రభుత్వం కృష్ణా జలాలను జిల్లాలోకి తరలించింది. ఈ సమయంలో పెద్ద అర్భాటమే చేశారు. బహిరంగ సభ నిర్వహించి ప్రభుత్వ నిధులు వృథా చేశారు. ఇంతచేసినా కేవలం 750 ఎంసీఎఫ్‌టీల నీటిని మాత్రమే కాలువలో పారించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2019 అక్టోబర్‌లో జిల్లాకు కృష్ణా జలాలను విడుదల చేశారు. 2020 నవంబర్‌లో కూడా కృష్ణా జలాలను జిల్లాకు తరలించారు. 2021, 2022లో పుష్కలంగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండుగా ఉండటంతో కృష్ణా జలాల తరలింపు అవసరం కలగలేదు. ఈ రెండు సార్లు జిల్లాకు 3.5 టీఎంసీల నీటిని తరలించారు. ఈ స్థాయిలో నీటిని తరలించినా సభలు, సమావేశాలతో అర్భాటం చేయలేదు. ప్రభుత్వం ధనం వృథా చేసే పనులు చేయలేదు. తాజాగా మూడోసారి కృష్ణా జలాలు విడుదల చేసినా అది అధికారుల చేతులమీదుగా జరిగింది.

రేపు రాత్రి సరిహద్దులోకి..

సత్యసాయి, అన్నమయ్య జిల్లాల సరిహద్దులోని తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దతిప్పసముద్రం మండలం గడ్డంవారిపల్లె వద్ద పుంగనూరు ఉపకాలువ ప్రారంభమవుతుంది. కృష్ణా జలాలు బుధవారం రాత్రికి ఇక్కడకు చేరుకుంటాయి. సత్యసాయిజిల్లాలోని బొంతలపల్లె ఎత్తిపోతల పథకం దాటుకుని కృష్ణా జలాలు ఇక్కడికి చేరాల్సి ఉంటుంది. తొలిరోజు 100 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేయడంతో ప్రవాహం కొద్దిగా మెల్లగా సాగుతుంది. మంగళవారం 150 క్యూసెక్కులకు పెంచనుండటంతో ప్రవాహం పెరుగుతుంది. దీనితో బొంతలపల్లె ఎత్తిపోతల పథకంవద్ద కాలువలోకి నీళ్లు నిండుగా చేరుతాయి. దీనితో రెండు పంపుల ద్వారా నీటిని ఎత్తిపోసి జిల్లాకు తరలించనున్నారు.

విద్యార్థుల సేవలో ఆర్టీసీ

- బడికి.. ప్రయాణం. ఉచితం
- జిల్లాలో 13332 మంది పాసులు
- 463 షెడ్యూల్ సర్వీసులు



నందలూరు బస్టాండులో బస్సు ఎక్కుతున్న విద్యార్థులు

రాజంపేట: చదువు భారం కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోంది. యూనిఫాం, పాఠ్యపుస్తకాలు , బూట్లు, స్కూల్ బ్యాగులు వంటి అవసరాలు తీరుస్తూ జగనన్న విద్యాకానుక పేరిట అందిస్తోంది. రుచికరకమైన మధ్యాహ్నభోజనం జగనన్న గోరుముద్ద పేరిట అమలుచేస్తోంది, మనబడి నాడు–నేడుతో పాఠశాలకు అత్యాధునిక సౌకర్యాలను కల్పిస్తోంది. తమ నివాసాలకు సుదూరంగా ఉండే ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచిత రవాణా సదుపాయం కూడా కల్పిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 13332 మంది పాసులు మంజూరు చేయగా, 463 షెడ్యూల్ సర్వీసులను విద్యార్థుల కోసం రోడెక్కిస్తున్నారు.

బాలికలకు బస్సు పాసు పూర్తిగా ఉచితం

ప్రభుత్వ పాఠశాలలో 1 నుంచి 10 వ తరగతి వరకు చదివే బాలికలకు ఆర్టీసీ బస్సులో పూర్తిగా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తోంది. 1 నుంచి 7 వరకు చదివే బాలురకు కూడా పూర్తిగా ఉచితంగా బస్సుపాసులు మంజూరు చేస్తోంది. పాఠశాలలకు వెళ్లే సమయంలో వివిధ రూట్లలో షెడ్యూల్ బస్సు లేని పక్షంలో వారి కోసం ప్రత్యేకంగా బడి బస్సు పేరిట సర్వీసులను నడుపుతున్నారు. పాసులు ఉన్న ప్రతి విద్యార్థి ఈ బస్సులో ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం కల్పిస్తూ విద్యార్థులను సమయానికి పాఠశాలలకు తీసుకెళుతున్నారు.

రాయితీతో..

7 నుంచి ఆపై తరగతులు చదివే బాలురకు, ఉన్నత చదువులు చదివే బాలికలకు ఆర్టీసీ బస్సులో ప్రయాణం రాయితీతో కూడిన పాసులను మంజూరు చేస్తున్నారు. ఈ పరిస్థితి వల్ల విద్యార్థులకు కొంతమేర ఉపశమనం కలుగుతుంది.

దాతలసహకారంతో...

విద్యార్థులకు ప్రభుత్వం ఆర్టీసీ ద్వారా ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించగా పాసులు ప్రింటింగ్, లామినేషన్ తదితర ఖర్చు కోసం విద్యార్థులు రూ.57 చెల్లించాల్సి ఉంటుంది. వారికి అది కూడా భారం కాకుడూదనే లక్ష్యంతో ఆర్టీసీ అధికారులు దాతల సహకారం తీసుకుంటున్నారు. కొంతమంది దాతలను సంప్రందించి పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని పాసులకు అయ్యే మొత్తాన్ని చెల్లించేలా ఏర్పాటుచేస్తున్నారు. ఈ విధంగా జిల్లాలోని రాయచోటి, రాజంపేట, మదనపల్లె–1, మదనపల్లె–2, పీలేరు డిపోల్లో డీఎంలు కృషిచేస్తున్నారు.

డిపో	ఉచితపాసులు	రాయితీ	ఆర్టీసీ బస్సులు	అద్దె బస్సులు
మదనపల్లె–1	5050	5482	78	28
మదనపల్లె–2	2356	4698	66	13
పీలేరు	1083	3671	61	20
రాజంపేట	1649	2174	39	36
రాయచోటి	3192	5178	79	43

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం ఉచితంగా అందచేస్తున్న బస్సుపాసులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. క్రమశిక్షణతో పాఠశాలను చేరుకుని అంకితభావంతో చదవి లక్ష్యాన్ని సాధించాలి. ఉచిత ప్రయాణం పొందే ప్రతి విద్యార్థి ఉన్నతస్థానాలకు చేరుకోవడం ద్వారా తమ కల్పించిన సౌకర్యానికి సార్థకత చేకూర్చాలి. –రాము, జిల్లా ప్రజారవాణా అధికారి, రాయచోటి

ఉచితపాసుల విద్యార్థులకు సకాలంలో సర్వీసులు



ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత పాసులు జారీ చేస్తున్న క్రమంలో అసౌకర్యాలు లేకుండా అందజేస్తున్నాము. పాఠశాల వేళల సమయానికి అనుకూలంగా సర్వీసులను తిప్పుతున్నాం. అవసరాన్ని బట్టి బడి బస్సు పేరిట బస్సును నడుపుతున్నాం. ప్రభుత్వం అందిస్తున్న ఉచితబస్‌పాసును సద్వినియోగం చేసుకోని సకాలంలో బడికి వెళ్లి విద్యావంతులు కావాలి. –రమణయ్య, డిపోమేనేజరు, రాజంపేట

క్లుప్తంగా

చెక్ బౌన్స్ కేసులో జైలు శిక్ష

నందలూరు (రాజంపేట) : చెక్ బౌన్స్ కేసులో ఓ వ్యక్తికి 18 నెలల జైలు శిక్ష పడింది. నందలూరుకు చెందిన ఆర్ఎంపీ ఎద్దుల కృష్ణమూర్తి దగ్గర నుంచి షేక్ గౌస్ పీరాబాషా 2018 డిసెంబర్ 17న రూ.30 లక్షలు అప్పుగా తీసుకొన్నందుకు గాను చెక్కు ఇచ్చాడు. ఆ చెక్ బౌన్స్ అయినందున కృష్ణమూర్తి నందలూరు కోర్టులో కేసు వేశారు. జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ జడ్జి కె.లత విచారణ చేపట్టి.. 18 నెలలు జైలు శిక్ష, చెక్ విలువ రూ.30 లక్షలు (ఐదు ప్రామిసరీ నోట్ల విలువ) పరిహారంగా చెల్లించాలని సోమవారం తీర్పు వెల్లడించారు.

మహిళ అదృశ్యం

ఒంటిమిట్ట : మండల పరిధిలోని కొత్త మాధవరం గ్రామానికి చెందిన సోమమౌనిక (27) అనే మహిళ అదృశ్యమైంది. బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తమాధవరం గ్రామానికి చెందిన సోమమౌనికకు అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులుతో ఆరేళ్ల క్రితం వివాహం అయింది. వారికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త గల్ఫ్ దేశమైన కువైట్‌లో ఉండటంతో ఆమె పిల్లలతో కలిసి కొత్త మాధవరంలో ఉండేది. ఆదివారం పిల్లలకు మరలా వస్తానని చెప్పి వెళ్లి.. ఎంత సేపటికీ రాలేదు. దీంతో వారి కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేస్తున్నామని ఎస్ఐ సి.మధుసూదన్‌రావు తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం పట్టణంలో జరిగింది. ప్రశాంత్ నగర్‌కు చెందిన ఫైరోజ్ భార్య సల్మా (31) ఇంటి వద్ద ఒంటరితనాన్ని భరించలేక, కుటుంబ సమస్యలతో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. స్థానికులు బాధితురాలిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కర్ణాటక రాష్ట్రం బేలూర్‌కు చెందిన సల్మాకు పదేళ్ల క్రితం మదనపల్లె ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఫైరోజ్‌తో మతాంతర వివాహం జరిగింది. ఆమెకు ఇద్దరు సంతానం ఉన్నారు. గత కరోనా సమయంలో భర్త మృతి చెందడంతో అప్పటి నుంచి ఇద్దరు పిల్లలతో జీవిస్తోంది. కొంత కాలంగా జీవితం పట్ల అభద్రతా భావం పెరగడం, బంధువులతో సత్సంబంధాలు లేక పోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు ప్రయత్నించింది. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

పదోన్నతిపై అభ్యంతరం

కడప రూరల్ : వైద్య, ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని ఓ ఉద్యోగి పదోన్నతిపై కొందరు అభ్యంతరం లేవనెత్తారు. కడపలోని పాత రిమ్స్‌లో ఉన్న ఈ కార్యాలయం వేదికగా శనివారం రాయలసీమ జిల్లాల్లోని 13 మందికి సీనియర్ అసిస్టెంట్ నుంచి ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి కల్పించారు. అందులో ఒకరు చెవుడు, మూగ కింద పదోన్నతి జాబితాలో ఉన్నారు. దీనిపై ఏపీ హియరింగ్ హ్యాండీక్యాప్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కేవీఎస్ఎస్ అనిల్‌కుమార్ ఆ పదోన్నతిని నిలుపుదల చేశారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ పోటీలు

- విజేతలుగా కడప, అనంతపురం జట్లు
- జాతీయ స్థాయి జట్టుకు క్రీడాకారుల ఎంపిక


అండర్-19 పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన కడప బాలికల జట్టు

మదనపల్లె : స్థానిక జెడ్పీ హైస్కూల్ మైదానంలో మూడు రోజులుగా నిర్వహించిన 67వ ఎస్‌జీఎఫ్ అంతర్‌జిల్లాల ఫుట్‌బాల్(అండర్-19) పోటీలు సోమవారం సాయంత్రం ముగిశాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల ప్రాతిపాదికన జట్లు పాల్గొన్నాయి. బాలికల విభాగంలో మొదటి స్థానంలో కడప, రెండో స్థానంలో అనంతపురం, మూడో స్థానంలో గుంటూరు, నాలుగో స్థానంలో విశాఖపట్నం నిలిచాయి. హోరాహోరీగా జరిగిన ఫైనల్స్‌లో 2-1 స్కోర్‌తో అనంతపురంపై కడప జట్టు జయకేతనం ఎగురవేసింది. బాలుర విభాగంలో ప్రథమస్థానంలో అనంతపురం, ద్వితీయస్థానంలో గుంటూరు, మూడోస్థానంలో కడప, నాలుగోస్థానంలో చిత్తూరు నిలిచాయి. ఫైనల్స్‌లో 4-3 స్కోర్‌తో అనంతపురం జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు మదనపల్లె ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ, ఎస్‌జీఎఫ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా సెక్రటరీ జయరామయ్య చేతుల మీదుగా కప్‌లు, మెడల్స్, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వరదారెడి గారి నారదరెడ్డి ఫుట్‌బాల్ పోటీల నిర్వహణకు రూ.10,116, విజేతలుగా నిలిచిన కడప(బాలికలు), అనంతపురం(బాలురు) జట్లులకు ఒక్కొక్క జట్టుకు రూ.10,116 చొప్పున మొత్తం రూ.30,348 ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఏర్పాటైన తర్వాత మదనపల్లెలో తొలిసారిగా 67వ ఎస్‌జీఎఫ్ అంతరజిల్లాల ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్‌జీఎఫ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా సెక్రటరీ జయరామయ్య మాట్లాడుతూ 67వ అంతరజిల్లాల ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఎంపిక చేశామన్నారు. వీరు రాష్ట్రం తరపున జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకరరెడ్డి, రాజగోపాల్, ఏసీటీఓ నాగేంద్ర, హెచ్ఎం సుబ్బారెడ్డి, మహమ్మద్‌ఖాన్, పీఈటీలు అన్సర్, సుధాకర్, రమేష్, నాగరాజు, కరుణానిధి, 13 జిల్లాల జట్ల మేనేజర్‌లు, కోచ్‌లు పాల్గొన్నారు.

అండర్-19 జాతీయ స్థాయి జట్టుకు ఎంపిక

ఈ పోటీల్లో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను జాతీయ స్థాయి జట్టుకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా సెక్రటరీ జయరామయ్య తెలిపారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా ఉదయ్‌భాస్కర్, శ్రీనివాసులు, రమేష్ వ్యవహరించారు. జాతీయ స్థాయి జట్టుకు ఎంపికైన బాలురు ఈ నెల 30వ తేదీ నుంచి నవంబర్ 4 వరకు జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో, బాలికలు నవంబర్‌లో పంజాబ్‌లో జరిగే జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

బాలికల జట్టు

ఎస్.భానుశ్రీ, కె.మనీషా, ఆర్.భువన, ఎం.సావిత్రి(కడప), పి.కావ్యశ్రీ, యు.హారిక, కె.మమత(అనంతపురం), ఎం.పవిత్రపావని, ఎం.జ్యోతి, పి.టి.వి.హరిప్రియ(గుంటూరు), పి.సులోచన, జి.హేమహాసిని(వైజాగ్), పి.సుహర్ష, ఏ.బెహ్హప్‌మన్ జున్నా(కృష్ణా), కె.పావని(చిత్తూరు), జి.కావేరి(ప్రకాశం), ఎం.శిరీషా(నెల్లూరు), వి.సత్యసౌమ్య(ఈస్ట్‌గోదావరి) రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారు. స్టాండ్‌బైలుగా కె.జొన్నాప్రహర్షిత(కృష్ణ), ఎం.వెంకటసుప్రజ (కడప), ఎల్.గాయత్రి(విజయనగరం), వి.ప్రజ్ఞారమణ(కర్నూలు), జీవిత(నెల్లూరు).

బాలుర జట్టు

ఆసిఫ్, ఎ.నందకిశోర్, భరత్, జి.నరేంద్ర(అనంతపురం), జి.కౌషిక్, ఎస్.డి.రవూఫ్, ఎస్.కె.నాగషరీఫ్(గుంటూరు), సీతుమాధవ్, పి.విఘ్నేష్(కడప), సుఫియాన్, సి.అరవింద్(చిత్తూరు), జె.మైఖేల్(ప్రకాశం), అభి(కర్నూలు), వైడియస్ అశ్వథ్(వైజాగ్), జే.రాముడు(కృష్ణ), కెల్విన్‌కెన్నెట్(చిత్తూరు), వై.కల్యాణ్(విజయవాడ), కె.అశోక్‌కుమార్(నెల్లూరు) స్టాండ్‌బైలుగా అఖిల్‌యాదవ్(చిత్తూరు), వి.విజయ్(గుంటూరు), డి.వీరబాబు(ఈస్ట్‌గోదావరి), టి.రోహిత్.శ్రీ.ఫణిధర్(వెస్ట్‌గోదావరి), జ్ఞానేశ్వర్(శ్రీకాకుళం).


ప్రథమ స్థానంలో నిలిచిన అనంతపురం బాలుర జట్టు


రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన బాలురు


రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన బాలికలు

'కృష్ణా జలాలతో బీజేపీ రాజకీయాలు'

కడప సెవెన్ రోడ్స్ : కృష్ణా నది జాలాలపై ఏర్పాటైన ట్రిబ్యునల్స్ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌కు కేటాయించిన నీటిని ఏపీ, తెలంగాణల మధ్య పున:పంపిణీ చేయాలంటే.. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు అదనపు బాధ్యతలను కట్టబెట్టడం ద్వారా తెలంగాణలో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న బీజేపీ కుట్ర రాజకీయాలను తిప్పి కొట్టాలని అఖిల పక్ష నాయకులు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ఆందోళనలో కాంగ్రెస్ నేత డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, టీడీపీ రాష్ట్ర నాయకుడు జి.లక్ష్మీరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రవిశంకర్‌రెడ్డి, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకుడు డబ్ల్యూ రాఘు మాట్లాడుతూ బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీలు నికర జలాలు కేటాయించడమే కాకుండా మిగులు జలాలను వాడుకునే వెసులుబాటు కల్పించిందని పేర్కొన్నారు. బచావత్ కేటాయింపులు యథావిధిగా అమలు చేస్తూనే మిగులు జలాలను కూడా 448 టీఎంసీలుగా లెక్కకట్టి మూడు రాష్ట్రాల మధ్య బ్రిజేష్ ట్రిబ్యునల్ పంపిణీ చేసిందన్నారు. దీనిపై ఆంధ్ర రాష్ట్రం సుప్రీం కోర్టులో వ్యాజ్యం దాఖలు చేసిందని తెలిపారు. ఒక వైపు కేసు విచారణలో ఉండగానే.. బీజేపీ ఇప్పుడు బ్రిజేష్ ట్రిబ్యునల్‌కు అదనపు బాధ్యతలు అప్పగించడం ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే అని విమర్శించారు. ఇటీవల కర్ణాటక ఎన్నికల దృష్ట్యా ఎగువ భద్రకు జాతీయ హోదా కల్పించి లబ్ధి పొందాలని చూసిందన్నారు. ఇప్పుడు తెలంగాణలో లబ్ధి పొందేందుకు కృష్ణా జలాల పేరుతో కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు రమణయ్య, గుర్రప్ప, నరసింహులు, దస్తగిరిరెడ్డి, కెసీ బాదుల్లా, నాగ సుబ్బారెడ్డి, వెంకటశివ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి హత్య కేసులో నిందితుల అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ, ఎస్ఐ, పోలీసులు

కలకడ : వ్యక్తి హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ నాగేంద్ర వివరాలు వెల్లడించారు. మండలంలోని కోన గ్రామానికి చెందిన యాలపల్లి రామక్రిష్ణ కుమారుడు నాగరాజును ఈ నెల 1వ తేదీ రాత్రి అదే గ్రామానికి చెందిన చెంగల నాగయ్య, శ్రీరాములు కలిసి వారి కుమార్తె గురించి చెడుగా ప్రచారం చేస్తున్నట్లు భావించి పథకం ప్రకారం కత్తితో పొడిచారు. వారి దాడిలో గాయపడ్డ నాగరాజ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ హత్య కేసును పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా పర్యవేక్షణలో మండలంలోని కోన క్రాస్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి హత్యకు వినియోగించిన కత్తిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిందితులను వాల్మీకిపురం కోర్టులో హాజరు పరిచారు. సమావేశంలో ఎస్ఐ తిప్పేస్వామి, పోలీస్ సిబ్బంది సునీల్‌కుమార్, హరిబాబు, రామ్మోహన్, అర్జున్, కరుణాకర్, మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

చిత్తూరు, అనంత జట్ల జయకేతనం


కేఓఆర్ఎం మైదానంలో పోటీపడుతున్న చిత్తూరు, కర్నూలు జట్లు


సాయిసూర్యతేజారెడ్డి, కర్నూలు, (140 పరుగులు)


దత్తారెడ్డి, అనంతపురం, (87 పరుగులు)


లోహిత్ సాయికిశోర్, అనంతపురం, (6 వికెట్లు)

కడప స్పోర్ట్స్ : ఏసీఏ అండర్-23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో చిత్తూరు, అనంతపురం జట్లు జయకేతనం ఎగురవేశాయి. కడప నగరంలోని కేఓఆర్ఎం మైదానంలో 41 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో సోమవారం బరిలోకి దిగిన చిత్తూరు జట్టు 11.5 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 72 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జట్టులోని శశాంక్ శ్రీవాత్సవ్ 29 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్ సాత్విక్ 2 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 54.4 ఓవర్లలో 220 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని సాయిసూర్యతేజారెడ్డి 140 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్లు ఆశిష్‌రెడ్డి 4, మల్లేశన్ 3 వికెట్లు తీశారు. కాగా చిత్తూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 550 పరుగులు చేయగా, కర్నూలు జట్టు 226 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో చిత్తూరు జట్టు 176 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

'అనంత' విజయం

కేఎస్ఆర్ఎం మైదానంలో 282 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన అనంతపురం జట్టు 64.3 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 318 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. జట్టులోని దత్తారెడ్డి 87 పరుగులు చేశాడు. కడప బౌలర్లు అస్లాం 3, విజయ భువనేంద్ర 2, ఆదిల్ హుస్సేన్ 2, సాయికుమార్‌రెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 38.4 ఓవర్లలో 172 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని శివకేశవరాయల్ 24 పరుగులు చేశాడు. అనంతపురం బౌలర్లు లోహిత్‌సాయికిశోర్ 6 వికెట్లు, మల్లికార్జున 3 వికెట్లు తీశారు. కాగా తొలి ఇన్నింగ్స్‌లో అనంత జట్టు 207 పరుగులు చేయగా, కడప 171 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో అనంతపురం జట్టు 182 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

ఇస్రో శిక్షణతో ఎంతో ఉపయోగం

వైవీయూ : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అందించే శిక్షణ పీజీ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. ఇస్రో ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా 14 విశ్వవిద్యాలయాలను ఎంపిక చేసి అందులో పీజీ విద్యార్థులు, పరిశోధక విద్యార్థులకు 'స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ అవేర్‌నెస్ ట్రెనింగ్' ఆన్‌లైన్ ద్వారా 18 రోజుల పాటు నిర్వహించింది. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న 32 మంది విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం వైవీయూలోని సీవీ రామన్ సైన్స్‌బ్లాక్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో ఇస్రో వైవీయూ నోడల్ అధికారి, భౌతికశాస్త్ర విభాగాధిపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, భౌతికశాస్త్ర అధ్యాపకులు వెంకటరాము, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

వైవీయూలో పీజీ ప్రవేశాలు షురూ

యోగివేమన విశ్వవిద్యాలయంలో పీజీ ప్రవేశాల ప్రక్రియ సోమవారం కొనసాగింది. ఏపీ పీజీసెట్-2023 రాసి అర్హత సాధించి రాష్ట్రంలో వివిధ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ నిర్వహించారు. వైవీయూలోని ఏపీజే అబ్దుల్ కలాం కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను వీసీ ఆచార్య చింతా సుధాకర్ పరిశీలించారు. ప్రవేశాల సంచాలకులు ఆచార్య కంకణాల గంగయ్య మాట్లాడుతూ 10వ తేదీ వరకు ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కలసపాడు : మండలంలోని దూలంవారిపల్లెలో సోమవారం 21 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగమురళి తెలిపారు. దూలంవారి పల్లెకు చెందిన పంజగాల వీరమ్మ అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా దాడులు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆమె వద్ద నుంచి 21 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితురాలిని అరెస్టు చేసినట్లు వివరించారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన

వేముల : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని జిల్లా నోడల్ అధికారి మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వి.కొత్తపల్లె గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష పనితీరుపై తెలుసుకునేందుకు ప్రభుత్వం అన్ని జిల్లాలకు నోడల్ అధికారులను నియమించిందన్నారు. వైద్యశిబిరానికి వచ్చిన రోగులను అడిగి.. అందుతున్న సేవలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన బీపీ చెకప్ చేయించుకున్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఓ అర్జున్ రావు, ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, తహసీల్దార్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

ఉపాధ్యాయుడికి తీవ్ర గాయాలు

చిన్నమండెం : మండల పరిధిలోని జల్లావాండ్లపల్లె మిట్ట వద్ద గల కస్తూరిబా పాఠశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు జాకీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ రమేష్‌బాబు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాయచోటిలోని ఉర్దూ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న జాకీర్ రాయచోటి నుంచి చిన్నమండెంకు ద్విచక్రవాహనంలో వస్తున్నాడు. జల్లావాండ్ల పల్లె మిట్ట సమీపానికి రాగానే బెంగళూరు నుంచి కడపకు వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన జాకీర్‌ను 108 సాయంతో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


చికిత్స పొందుతున్న జాకీర్

అదరగొట్టిన కడప బాలికలు


కడప బాలికల జట్టుకు రూ.20 వేలు అందిస్తున్న శెట్టిపల్లె నాగిరెడ్డి


బాలుర విభాగంలో విజయం సాధించిన విజయనగరం జట్టు

- ముగిసిన అండర్-17 వాలీబాల్ పోటీలు
- విజేతలుగా కడప, విజయనగరం జట్లు

మైదుకూరు : మైదుకూరులో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-17 బాలుర, బాలికల వాలీబాల్ పోటీల్లో కడప, విజయనగరం జట్లు అదరగొట్టాయి. మైదుకూరు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరిగిన ఈ పోటీలు సోమవారం ఫైనల్ మ్యాచ్‌లతో ఘనంగా ముగిశాయి. స్థానిక మేధా డిఫెన్స్ అకాడమి మైదానంలో ఒకటో కోర్టులో సోమవారం బాలుర విభాగంలో విజయనగరం - పశ్చిమగోదావరి జిల్లాల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగగా విజయనగరం విజేతగా నిలిచింది. రెండో కోర్టులో బాలికల విభాగంలో కడప- గుంటూరు జిల్లాల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కడప జట్టు ఘన విజయం సాధించింది. బాలుర విభాగంలో సెమీ ఫైనల్‌లో విజయనగరం జట్టు చేతిలో ఓడిపోయిన శ్రీకాకుళం, బాలికల విభాగంలో సెమీ ఫైనల్‌లో గుంటూరు జట్టుతో ఓడిపోయిన ప్రకాశం మూడో స్థానంలో సరిపెట్టుకున్నాయి.

క్రీడా స్ఫూర్తితో పోటీలు జరగడం హర్షణీయం

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు మైదుకూరులో క్రీడా స్ఫూర్తితో జరగడం హర్షణీయమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి తెలిపారు. వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు సమావేశంలో ఆయన అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలు మైదుకూరులో నిర్వహించడం నియోజకవర్గానికి ప్రతిష్టగా నిలిచిందన్నారు. టోర్నమెంట్ ప్రారంభ వేడుకల్లో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఆయన తనయుడు నాగిరెడ్డి సోమవారం పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు నగదు బహుమతులను అందజేశారు. బాలికల, బాలుర విభాగంలో విజేతలుగా నిలిచిన కడప, విజయనగరం జట్లకు రూ.20 వేల చొప్పున, రెండో స్థానంలో నిలిచిన పశ్చిమగోదావరి, గుంటూరు జట్లకు రూ.10 వేల చొప్పున నగదు బహుమతులను ఆయా జట్ల కెప్టెన్, కోచ్ మేనేజర్లకు అందజేశారు. మూడో స్థానంలో నిలిచిన శ్రీకాకుళం, ప్రకాశం జిల్లాల జట్లకు రూ.5 వేల నగదును అందించారు. మైదుకూరు మున్సిపల్ వై.రంగస్వామి మాట్లాడుతూ పోటీల్లో గెలుపోటములు సహజమేనని అన్నారు. మైదుకూరులో వాలీబాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రతిభ చూపి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తేవాలని సూచించారు. శెట్టిపల్లె నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్‌తోపాటు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల కార్యనిర్వాహక కార్యదర్శులు అరుణకుమారి, వసంత, మేధా డిఫెన్స్ అకాడమి చైర్మన్ సి.నరసింహులు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర నాయకులు విజేతలుగా నిలిచిన జట్లలోని క్రీడాకారులకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ బహూకరించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నాయకులు సాజిద్, రమేష్ యాదవ్, నిత్య ప్రభాకర్, ప్రవీణ్ కుమార్, కిరణ్, శ్రీకాంత్, రమేష్ బాబు, గణేష్ బాబు పాల్గొన్నారు.

రాష్ట్ర జట్లకు ఎంపిక

మైదుకూరు : శ్రీనగర్‌లో వచ్చే నెలలో జరిగే జాతీయ స్థాయి అండర్-17 బాలుర, బాలికల వాలీబాల్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్లను ఎంపిక చేశారు. అండర్-17 బాలుర, బాలికల వాలీబాల్ టోర్నమెంట్ ముగిసిన అనంతరం రాష్ట్ర బాలుర, బాలికల జట్లను ఎంపిక చేశారు.

బాలికల జట్టు

జి.ప్రవల్లిక (విశాఖపట్నం), ఎం.విజయలక్ష్మి (విజయనగరం), వి.కుసుమప్రియ, పావని (కడప), సోని, ఎం.సుమశ్రీ(గుంటూరు), పి.జశ్విత(అనంతపురం), ఇ.షణ్ముఖ ప్రియ (చిత్తూరు), కె.ప్రీతి (తూర్పుగోదావరి), ఎస్.పూజిత (ప్రకాశం), సీహెచ్ శ్రీవద్మజ(కృష్ణ), స్టాండ్ బైగా డి.కీర్తన (గుంటూరు), ఎస్.మానస (అనంతపురం), ఎం.వెంకటలక్ష్మి (నెల్లూరు), ఎస్.ఉన్నత సత్యశ్రీ(కృష్ణ), డి.సమైక్య (ప్రకాశం).

బాలుర జట్టు : ఎ.ప్రేమ్ కుమార్, ఎస్.తోషన్ రాము (శ్రీకాకుళం), టి.రాహుల్, ఎన్.మౌర్య (విశాఖపట్నం), బి.రంజిత్ (విజయనగరం), వి.రాజు (పశ్చిమ గోదావరి), టి.సుధీర్ (అనంతపురం), కె.డేవిడ్ రాజు (గుంటూరు), పి.కిరణ్‌బాబు (ప్రకాశం), ఎన్.అజయ్‌కుమార్ (కడప), స్టాండ్‌బైగా ఎస్.భరత్ (కృష్ణ), వై.రోహిత్(కడప), ఎం.ఆర్యన్ (నెల్లూరు), బి.కార్తీక్(అనంతపురం), వై.రాంబాబు (తూర్పుగోదావరి), కె.రాము (పశ్చిమ గోదావరి).


జాతీయ పోటీలకు ఎంపికైన బాలుర జట్టు


రాష్ట్ర స్థాయి వాలీబాల్ బాలికల జట్టు

ఉద్యోగం ఇప్పిస్తానని టోకరా

చాపాడు : మండల పరిధిలోని చియ్యపాడు గ్రామానికి చెందిన చీమల సూర్యనారాయణరెడ్డి అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం ఇప్పిస్తానని ఒక యువతికి రూ.5 లక్షలు టోకరా పెట్టిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లాలోని నకరికల్లు మండలానికి చెందిన రుసుం బిందు మాధవి అనే యువతి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తోంది. తన తమ్ముడికి ఉద్యోగం కోసమని తనతోపాటు పని చేస్తున్న సూర్యనారాయణరెడ్డికి రూ.5 లక్షలు ఇచ్చింది. ఆయన ఉద్యోగం ఇప్పించకపోగా డబ్బు తిరిగి ఇవ్వలేదు.

దీంతో బాధితురాలు సోమవారం చీపాడులో సూర్యనారాయణ ఇంటి ఎదుట కూర్చొని నిరసన వ్యక్తం చేసింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువురిని స్టేషన్‌కు తరలించారు.